# ఐక్యత

★

కొడవటిగంటి కుటుంబరావు.

★



"ఏమోయ్, ఇట్లావచ్చావూ ?"

"ఏమీలేదోయ్, అర్జంటుగా పదిరూపాయలు కావాలి, ఏమన్నా సద్దుతావేమోనని."

"అరెరే, మొన్నసాయంకాలం చెప్పకపోతివే. నిన్నపొద్దునే మన శివరామయ్యగారికి కావాలంటే ఓవెయ్యి బదులిచ్చాను. చెబితే నమ్మవుగాని చేతిలో దమ్మిడీలేదు."

"నిన్న సాయంకాలంకూడా నాదగ్గిరో వందరూపాయలుండెనుగా ?....ఏది, షావుకారు శివరామయ్యకేనా ?"

"మరేనోయ్."

"నేను మళ్లీ రేపుదయానికల్లా ఇచ్చేస్తాలేవోయ్."

"ఎల్లుండి ఉదయానికల్లా నాకూరావాలో అయిదువందలు....పోనీ నువు రేపు సాయంకాలం——లేదా, ఎల్లుండిపొద్దుటిదాకా కాస్త ఓపికపట్టలేవుటోయ్ ? నీకు కావలసిన పదీ ఇచ్చేస్తానూ !"

"ఎల్లుండి ఉదయానికి నాకూవొస్తుందిగా ?"

"రేపుదయానికే వొస్తుందన్నావ్ ?"

"రేపుదయానికే వస్తుందంటే ఎల్లుండిమాట వేరేచెప్పాలాఅనినాతాత్పర్యం."

"ఓహో, అదా ? సరే అయితే !"

"ఇంతకూ ఏమంటావ్ ?"

"చెబితినికాదుటోయ్....పోదూగాని కాస్సేపు కూచోవోయ్. కొత్తసినీమా చూశావా ?"

"చూశానోయ్, ఎట్లాఉందినీకు ?"

"చాలా బాగుందిసుమా."

"నీక్కూడా అట్లాగే అనిపించిందిటోయ్? నాకూబాగానేఉందిసుమా!"

"కాని, ఆ ఫొటోగ్గిరాఫీఉంది చూశావూ? అదేమంత—"

"నువ్వూ గుర్తించావూ? ఏడిసి మొహంకడుక్కున్నట్టుగాఉంది. అంచేత్తే జనం రావటంలేదు."

"పోనీవోయ్, వెధవజనం! వొట్టిగొర్రెలమంద! ఒకడుపోవటంమానేస్తే అంతామానేస్తారు. మంచిసినీమాఅంటే ఒక్కడూరాడు. ఆఅరవబూతులంటే ఎగ బడతారు."

"బాగాఅన్నావ్. అరవలంపటంపట్టుకుంది ఆంధ్రజాతికి."

"అట్లాఅనలేమోయ్. అరవ్వాడంటే అభిమానంఉన్న ఆంధ్రుణ్ణెక్కడైనా చూశావూ?"

"అదేనేనూ అనొస్తున్నానోయ్."

"వాళ్ళకుకావలసిన బూతులా అరవసినీమాల్లో ఉంటంచేత పోతున్నారుగాని మనవాళ్ళు చచ్చినా అరవసినీమాలు చూస్తారా?"

"కాధూమరీ?"

"నేననేదేమంటే, ఆబూతులేవో మనసినీమాల్లోనే పెట్టెయ్యరాదాంట!"

"అదీమాట!"

"మనవాళ్ళూ ఇప్పుడిప్పుడు నేరుస్తున్నారులే బూతుసినీమాలు తియ్యటం!"

"నేర్చకేం?"

"అరవల్ని అనుకరించాలని కాదుసుమా—"

"అబ్బే! ఛా, ఛా!"

"కేవలమూ మనప్రజని అరవలంపటంనుంచి విముక్తిచెయ్యాలనే!"

"తప్పకుండానూ!"

"నిన్నుచూస్తే నాకిందుకే సంతోషమోయ్. మనిద్దరిఅభిప్రాయాలూ ఒకేమాట కలుస్తాయ్."

"ఇంతకూ, నీదగ్గిర....లేదుగా?"

"లేదోయ్, పాపం!........ కాస్సేపు కూచోవోయ్! ఈమధ్య కుప్ప ప్రత్రి కేమైనా చూశావుటోయ్?"

"మా పక్కింటివాళ్ళు రోజూ తెప్పిస్తూనే ఉంటారోయ్."

"అదికాదోయ్. సారస్వతపత్రికలోయ్."

"ఏముంది వాటిల్లో ?"

"ఏమీ ఉండదోయ్. అదేచిత్రం. నీకేమన్నా వాటిల్లోఉన్నట్టు కనపడిందా ?"

"గుర్తులేదోయ్."

"చూశావా ? అసలు మనదేశంలో రాసేవాడు లేడోయ్."

"బాగాచెప్పావులే ! అందుకనే నే నేపత్రికా చూడనోయ్."

"పోనీ ఇంతమంది రాస్తున్నారుకదా ఒక్కడైనా ఫలానాఅని చెప్పుకోటానికుందా ?"

"ఏదీ ?"

"రాసేవాళ్లలో ఒక దివానుబహదూరుగాని, ఒక రావుబహదూరుగాని ఉన్నాడా ?"

"తేందే ?"

"ఒకపెద్ద అధికారిగాని, ఒక ఊరిచేర్మనుగాని, ఒక పోలీసినస్పెక్టరుగాని, ఒక మహానాయకుడుగాని——"

"అబ్బె !"

"అందుకని నేనేంచేశానో తెలుసునా ?"

"ఏంచేశావోయ్ ?"

"నేనుకూడా ఒకకథ రాసేశానోయ్ !"

"నిజంగాదోయ్ ?"

"నిజంగానోయ్ !"

"ఎవరికథ రాశావోయ్ ?"

"టాల్‌స్టాయి కథోయ్."

"చాలా గొప్పవాడోయ్."

"నీక్కూడా టాల్‌స్టాయంటే అభిమానమేటోయ్ ?"

"అంతా ఇంతానా ?"

"అయితే చిక్కేంవచ్చిందంటే, టాల్‌స్టాయికథ నాకు ఇంగ్లీషులో దొరక లేదోయి. అంచేత తెలుగులోనే చదివి రాసేశాను."

"అది మరీమంచిదోయ్."

"దీన్ని ఏపత్రిక్కి పంపిస్తామాఅని ఆలోచిస్తున్నానోయ్."

"ఏదన్నా మంచిపత్రిక్కి పంపించవోయ్."

"అయితే ఒకసందేహ మోయ్. మంచిపత్రిక్కిపంపించి మన పేరుకాస్త గౌరవపదంగా ఉండేట్టు చూసుకోవటమా లేక సామాన్యపత్రిక్కి పంపించి వాళ్ల కింత ఉపకారం చెయ్యటమా అని."

"అదీ నిజమేనోయ్."

"మనవ్యాసం సాదాగాపంపించటమా, రిజిస్టరీచేసి పంపించటమా అని చూస్తున్నానోయ్."

"రిజిస్టరీచేసి పంపిస్తేనే కాస్త—ఇదిగాఉంటుందేమో !"

"నేనూ అదే అనుకున్నానోయ్."

"ఇక నేను పోతానోయ్....మరెవరిదగ్గిరన్నా చూడాలిగా !"

"అన్నట్టు నిజమేనోయ్, పాపం!.... వెళ్లచ్చులే కూచోనోయ్. ఈ ఎలెక్షను గొడవలన్నీ చూస్తున్నావుటోయ్ ?"

"చూస్తూనే ఉన్నానోయ్."

"దేశంలో ఇన్నిపార్టీలుండబట్టేకదా ఈ అనర్థమంతానూ."

"మెల్లిగా అంటావేమిటోయి ?"

"ఈ అనర్థం అంతంకావాలంటే నాకో మంచిఉపాయం తడుతున్నదోయి."

"ఏమిటోయి ఆఉపాయం ?"

"ఈ ఎలెక్షన్లలోగెలిచి పదవులుపట్టేపార్టీ ఏదైతేఉందో, అది మిగిలినపార్టీ లన్నిటినీ నిషేధించి జైళ్లలోపెట్టేస్తే పీడ విరగడైపోతుందోయి."

"ఎంతచక్కని ఆలోచన చేశావోయి ?"

"నీకూ్కడా బాగుందిటోయి ఈఆలోచనా ?"

"అడుగుతున్నావుటోయి ?"

"అయితే నాసూచన ఓ కార్డుముక్కమీద గాంధీమహాత్ముడికి గీకి పోస్టులో పడెయ్యమన్నావూ ?"

"ఏకంగా ఓ అర్జంటు టెలిగ్రామే కొట్టించవోయి."

"అంతేనంటావా ?"

"అక్షరాలా !"

"అయితే, ఏమోయి, చూడూ. ఇంతసేపూ కూచోపెట్టి నిన్నూరికే పంపించటం నాకేమీబాగాలేదోయి. పోనీ నాదగ్గిరో రూపాయుంది నీకిచ్చెయ్యనా ?"

"పాపం నీకుండదేమోనోయి ?"

"రేపొద్దుటిదాకా నాకు తొందర్లేదులేవోయి. రేప్పొద్దున తప్పకుండా ఇస్తావు కాదూ ?"

"ఎందుకివ్వనోయి ?"

"లేకపోతే నేను చాలా ఇబ్బందిపడిపోతానోయి."

"నీకేం ఫరవాలేదోయి."

"నేనెవరిమాటా నమ్మేవాణ్ణికాదోయి. నీమాటగనక నమ్ముతున్నాను."

"నాకా సంగతి తెలీదుటోయి ?"

"పనిలోపని నాకోసాయం చేసిపెట్టవోయి."

"ఏమిటోయదీ ?"

"కాస్త నాకథ ఏదన్నా మంచి పత్రిక్కి రిజస్టరీచేయించి, కాస్త గాంధీమహాత్ముడికో టెలిగ్రాం నాపేర ఇప్పించవోయి."

"ఈ రూపాయిలోనా ?"

"ఎందుకోయి ? పాపం, ఈరూపాయ నీఖర్చుకుంచుకుని వేరేనీదగ్గిర చిల్లరుంటే దాంతో కాస్త ఉపకారం చేసిపెట్టవోయి."

"అట్లాగేలేవోయి, భాగ్యమా ? వస్తానోయి."

"మంచిదోయి !"

---

అర్ధరాత్రి. కారుచీకటి. నిర్మానుష్యమైన రోడ్డు. అమాంతంగా కారు ఆగిపోయింది. యువకుడు రేడియేటర్ దగ్గిరికి వెళ్ళి కాసేపు ఎగాదిగా చూసి, కారులోవున్న యువతిని వుద్దేశించి అన్నాడు. "ఎంతపని జరిగింది—ఒక్కచుక్క పెట్రోల్ లేదు. టాంకు ఖాళీ. కన్నంపడింది కాబోలు!"

యువతి ఒక్కసారి ఎగబీల్చి అంది. "అలాగా!....ఇలాటి వుపద్రవం చాలాసార్లు సంభవించింది నాకు. లోపలికిరా. మనం చెయ్యవలసిందల్లా—కాసేపు తాపీగా కూచుని మంచీచెడ్డా మాటాడుకోవటం. ఆపైన పెట్రోల్ దానంతటదే వూరుతుంది."

★

చీకటిపడింది. కర్నలూ డ్రయివరూ "జీప్" లో వున్నారు. తొందర తొందరగా తమ "లైన్స్" చేరుకోవాలి.

రోడ్లు కలిసే ఒక కూడలిదగ్గిర పోలీసునుంచుని దారి చూపిస్తున్నాడు. కొంతదూరం పోయినాక కర్నల్‌కి అనుమానం తగిలింది. టర్నింగ్‌కి ఒకమైలులో బ్రిడ్జివుండాలని జ్ఞాపకం. ఆవంతెన కనిపించదే!

కారు ఆపించి పదిగజాలు నడిచాడు. బ్రిడ్జికిబదులు పెద్ద అఖాతం ఎదురయింది. కారాలూ మిరియాలు నూరుతూ వెనక్కివచ్చాడు పోలీసు దగ్గిరికి.

అంటాడు పోలీసు, "మీరుచెప్పేది తెలీడంలేదు సార్. సాయంత్రంనుంచీ ఎన్నోకార్లుపంపించాను. మీదేసార్, మొదటికంప్లయింట్."

---

Edited & Published by the Proprietor,
Chanduri Nageswara Rao, Powerpet, Ellore.
Printed at the Andhra Art Press - Ellore.